నేడు తెలంగాణ భవన్‌లో
ఉగాది వేడుకలు
పాల్గొననున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ భవన్‌లో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా జరిగే పంచాంగ శ్రవణం, వేదపండితుల ఆశీర్వచనం, షడ్రుచుల ఉగాది పచ్చడి సేవనంలో ఆయన పాల్గొననున్నారు.

ఎంపీ వద్దిరాజు శుభాకాంక్షలు..

బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలతోపాటు దేశ, విదేశాల్లో నివసిస్తున్న తెలుగు వారికి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఉగాది రోజు షడ్రుచులతో తయారుచేసిన పచ్చడి సేవించడం ఆరోగ్యకరమన్నారు. ఈ పర్వదినం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో ఆలయాలను సందర్శించి పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనంలో పాల్గొనడంతో శుభం కలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

బీసీ బిల్లులను తక్షణం అమలుచేయాలి

- సర్కారు చిత్తశుద్ధి చాటాలి
- మోసపూరిత వైఖరిని వీడాలి
- బీసీ సంఘాల నేతల డిమాండ్

హైదరాబాద్, మార్చి29 (నమస్తే తెలంగాణ): 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లులను తక్షణమే అమలులోకి తేవాలని, బీసీలపై కాంగ్రెస్ సర్కార్‌కు ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, మాజీ స్పీకర్, బీఆర్ఎస్ శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ సెంటర్ కోర్టు హాళ్లలో బీసీ జనసభ ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ల అంశంపై శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. కాంగ్రెస్ సర్కారు తూతూమంత్రంగా కులగణన నిర్వహించిందని, 42శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా 9వ షెడ్యూల్లో చేర్చాలని ఇప్పుడు మరో నాటకానికి తెరతీసిందని ఆర్ కృష్ణయ్య మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలంటే బీసీ, కుల సంఘాలు పార్టీలకతీతంగా ఒకతాటిపైకి రావాలని మధుసూదనాచారి పిలుపునిచ్చారు. 42 శాతం రిజర్వేషన్ల అమలుకు జెండాలు, అజెండాలను పక్కనపెట్టి పోరాడాల్సిన అవసరం ఉన్నదని ఎమ్మెల్సీ ఎల్ రమణ చెప్పారు. తక్షణం 42శాతం రిజర్వేషన్ల బీసీ బిల్లులను గవర్నర్ చేత ఆమోదింపజేయాలని రాజారాం యాదవ్ డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, సీనియర్ జర్నలిస్టు రమణకుమార్, బీసీ జర్నలిస్టుల ఫోరం నాయకుడు మేకల కృష్ణ, బీసీ అడ్వకేట్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు లోడంగి గోవర్ధన్‌యాదవ్, ఎంబీసీ కులాల జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ, బీసీ సంఘాల నాయకులు దాసు సురేశ్, గుజ్జ కృష్ణ, గుజ్జ సత్యం, లాల్ కృష్ణ, గోరిగ మల్లేశ్‌యాదవ్, అనంతుల రామ్మూర్తిగౌడ్, రామకోటి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ చొరవతోనే రాష్ట్రానికి 'కిటెక్స్'

- బీఆర్ఎస్ ప్రభుత్వమే భూములిచ్చింది
- భారీ పెట్టుబడులకు ఒప్పందం కుదిరింది
- సీనియర్ పాత్రికేయుడు సురేశ్ కొచ్చట్టిల్

హైదరాబాద్, మార్చి 29(నమస్తే తెలంగాణ): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చిన్నపిల్లల బట్టల తయారీ సంస్థ 'కిటెక్స్' కేటీఆర్ చొరవతోనే తెలంగాణ రాష్ట్రానికి వచ్చిందని సీనియర్ పాత్రికేయుడు సురేశ్ కొచ్చట్టిల్ తెలిపారు. ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, కేరళలో కార్యకలాపాలు సాగిస్తున్న కిటెక్స్ సంస్థ అక్కడి ప్రభుత్వ విధానాలతో విసుగుచెంది తమిళనాడుకు వెళ్లేందుకు సిద్ధమైందని చెప్పారు. ఈ విషయం తెలిసిన వెంటనే తాను అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ కార్యాలయానికి సమాచారం అందించానని చెప్పారు. కిటెక్స్ వ్యవస్థాపకుడు, ఎండీ సాబూ జాకబ్ సమాచారాన్ని వారికి చేరవేశానని పేర్కొన్నారు. దీంతో కేటీఆర్ వెంటనే స్పందించి ఒకటి రెండు రోజుల్లోనే ప్రైవేట్ విమానాన్ని కేరళకు పంపి జాకబ్‌తోపాటు కిటెక్స్ బృందాన్ని హైదరాబాద్‌కు తీసుకొచ్చారని తెలిపారు. హైదరాబాద్‌నుంచి హెలికాప్టర్‌లో వారిని వరంగల్‌కు తీసుకెళ్లి అక్కడ వస్త్ర పరిశ్రమకు కేటాయించిన భూములను చూపించినట్టు వివరించారు. అనువైన భూమిని ఎంపిక చేసుకున్న సాబూ జాకబ్ వెంటనే రాష్ట్రంలో భారీ పెట్టుబడి పెట్టేందుకు ప్రభుత్వంతో ఒప్పందం కూడా చేసుకున్నారు అని సురేశ్ గుర్తుచేశారు.

50 వేల మందికి ఉపాధి

కిటెక్స్ సంస్థ సుమారు రూ.3,000 కోట్ల పెట్టుబడితో వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌తోపాటు హైదరాబాద్ సమీపంలోని సీతారాంపూర్‌లో మరో తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నది. రాష్ట్రం నుంచి రోజుకు 22 లక్షల బట్టలను తయారుచేసి అమెరికాకు ఎగుమతి చేయాలన్నది కంపెనీ లక్ష్యం. కిటెక్స్ కంపెనీలో సుమారు 50,000 మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు లభించనుండగా, అందులో 80 శాతం మహిళలకే అవకాశం కల్పించనున్నట్టు సాబూ ఇదివరకే వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆనాడు కిటెక్స్ సంస్థకు వరంగల్‌లో 185 ఎకరాలు, సీతారాంపూర్‌లో 250 ఎకరాల భూమిని కేటాయించింది. వరంగల్‌లోని యూనిట్ త్వరలోనే ఉత్పత్తిని ప్రారంభించనుండగా, కిటెక్స్ ద్వారా ఏటా రూ.4,000 కోట్ల విదేశీ మారక ద్రవ్యం సమకూరుతుందని అంచనా. కిటెక్స్ బట్టల తయారీకి చాలావరకు మన రాష్ట్రంలోని రైతుల నుంచే కాటన్‌ను కొనుగోలు చేయాలని నిర్ణయించడం విశేషం.

బీసీ బిల్లు ఎక్కడుంది?

- గవర్నర్ వద్దా.. రాష్ట్రపతి వద్దనా..?
- కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలెప్పుడు
- కులగణన లెక్కలు బహిర్గతం చేయాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్
- కామారెడ్డిలో బీసీ సంఘాలతో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్

కామారెడ్డిలో బీసీ కులాల రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, వేదికపై ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్, మాజీ జడ్పీటీసీ జగన్, బీసీ కుల సంఘాల ప్రతినిధులు

నిజామాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఎక్కడుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. యునైటెడ్ పూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శనివారం కామారెడ్డిలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన బీసీ కుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత మాట్లాడారు. 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఇప్పుడు గవర్నర్ దగ్గర ఉన్నదా.. రాష్ట్రపతి వద్దకు పోయిందా? సీఎం రేవంత్‌రెడ్డి జవాబు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ పార్టీ మంగళం పాడిందని అన్నారు. కుల గణన పేరిట బీసీ వర్గాలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. బీసీల్లో అత్యంత వెనుకబడిన 36 ఎంబీసీ కులాలకు మంత్రిత్వశాఖ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, ఇంతవరకు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. రాజకీయ, విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లు రావాలని, ఇందుకోసం మూడు బిల్లులు పెట్టాలని సూచించారు.

బీసీలకు న్యాయం చేసింది కేసీఆరే..

బీసీలకు పెద్దపీట వేసింది కేసీఆరేనని కవిత గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సంక్షేమ బడ్జెట్‌లో 70 శాతం వరకు బీసీలకే కేటాయించారని చెప్పారు. ఐదుగురు రాజ్యసభ, 8 మంది ఎమ్మెల్సీలు, 58 మంది కార్పొరేషన్ చైర్మన్ పదవులను కట్టబెట్టి బీసీలను గౌరవించిన ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమేనని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీకి గతంలో ఏ ముఖ్యమంతి ఉంటే వారి సామాజికవర్గానికి చెందిన వారే వీసీలు అయ్యే వారని, ఏ ఒక్కరూ ఓయూకు బీసీ బిడ్డను వీసీగా చేయలేదని చెప్పారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని ఉద్యమ బాట పడుతున్నామని చెప్పారు.

కులగణనకు వ్యతిరేకంగా మోదీ అఫిడవిట్

బీజేపీ చాలా ఘోరమైనదని కవిత వ్యాఖ్యానించారు. జన గణన, కుల గణన చేయాలని సుప్రీంకోర్టును కొద్దిమంది ఆశ్రయించగా, బీసీ ప్రధాని అని చెప్పుకునే మోదీ తాము కులగణన చేయబోమని అఫిడవిట్ సమర్పించారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జాజుల సురేందర్, యునైటెడ్ పూలే ఫ్రంట్ కో-కన్వీనర్ శివశంకర్, బాజిరెడ్డి జగన్, సుమిత్రానంద్, అయాచితం శ్రీధర్, నవీనాచారి, సంపత్‌గౌడ్, నరాల సుధాకర్, విజయేందర్, కాసాని వీరేశ్, భాస్కర్ యాదవ్, జుబేర్, నరేశ్, మారయ్య, సాంబారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మాట తప్పితే గ్రామాల్లో తిరగనియ్యం..

బీసీ రిజర్వేషన్ అంశంపై బీజేపీ, కాంగ్రెస్ నేతలు మాట తప్పితే గ్రామాల్లో తిరగనిచ్చే ప్రసక్తే లేదని రౌండ్ టేబుల్ సమావేశం ముగింపులో కవిత ప్రకటించారు. తప్పించుకునే పని చేస్తే ఆ రెండు పార్టీలను బీసీ ప్రజలంతా వెంటాడుతారని హెచ్చరించారు. అలవికాని హామీలను ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ మొదటి ప్రాధాన్యతగా బీసీ డిక్లరేషన్‌లో పొందుపర్చిన బీసీ విద్యార్థులకు 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

నీళ్లివ్వకుండా రైతుల మధ్య చిచ్చుపెట్టిన సర్కార్
జనగామ ఎమ్మెల్యే పల్లా

జనగామ, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : దేవాదుల పంపులు సకాలంలో ఆన్‌చేసి నీళ్లివ్వలేని రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల మధ్య కొట్లాటలతోపాటు రైతుల మధ్య చిచ్చుపెట్టిందని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. లెఫ్ట్ కెనాల్ విప్పితే.. రైట్ కెనాల్ వాళ్లు కొట్లాట.. రిజర్వాయర్ నుంచి నీటిని తరలిస్తే ఆయకట్టు రైతుల మధ్య గొడవలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం జనగామ నియోజకవర్గంలోని 91 మంది లబ్ధిదారులకు రూ.26.48 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ బొమ్మకూరు, కన్నెబోయినగూడెం, వెల్దండ, చీటకోడూరు రిజర్వాయర్ల ద్వారా గతంలో వాటి పరిధిలోని చెరువులు, కుంటలన్నీ నిండాయని గుర్తుచేశారు. కేసీఆర్ కట్టిన సమ్మక్క బ్యారేజ్‌లో ఎండాకాలంలోనూ నీళ్లు ఉన్నా.. వాటిని తీసుకొచ్చే తెలివి కాంగ్రెస్ పాలకులకు లేదన్నారు. గోదావరిలో నీళ్లుండి..ఎత్తడానికి మోటర్లుండి.. ఆన్ చేయడానికి కరెంటు, పని చేయడానికి వ్యవస్థ ఉన్నా నేరపూరిత నిర్లక్ష్యంతో ప్రభుత్వం 34 రోజులు మెయింటెనెన్స్ రూ.6 కోట్లు విడుదల చేయకపోవడంతో రూ.600 కోట్ల పంట నష్టం జరిగిందని ధ్వజమెత్తారు.

రేపు రిజిస్ట్రేషన్ ఆఫీసులకు సెలవు రద్దు

హైదరాబాద్, మార్చి 29 (నమస్తే తెలంగాణ): రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు ఈనెల 31న సెలవును రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్ సందర్భంగా ప్రభుత్వం పబ్లిక్ హాలీడేలు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఎల్ఆర్ఎస్ రిబేట్‌కు సోమవారంతో గడువు ముగుస్తుండటంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు తెరిచి ఉంచాలని నిర్ణయించింది.

రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్ర ఐపీఎస్ మృతి
దోమలపెంట వద్ద కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

నాగర్‌కర్నూల్/దోమలపెంట/ ముంబై మార్చి 29 : శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి దోమలపెంట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్ర ఐపీఎస్ అధికారి సుధాకర్ పాండే, అతని బంధువు మృతిచెందారు. హైదరాబాద్ పోలీసు అకాడమీలో శిక్షణ తీసుకుంటున్న సుధాకర్‌తోపాటు భగవత్ కిషన్‌రావు శనివారం శ్రీశైలం మల్లన్న దర్శనానికి ఇన్నోవా కారులో హైదరాబాద్ నుంచి బయలుదేరారు. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట సమీపంలోకి రాగానే ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్నాయి. దీంతో సుధాకర్ (45), కిషన్‌రావు (50) అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించి కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఐపీఎస్- 2011 బ్యాచ్‌కు చెందిన సుధాకర్ ప్రస్తుతం ముంబై పోలీస్ పోర్ట్ జోన్ డీసీపీగా పనిచేస్తున్నారు.

తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక దాశరథి

- జైల్లో ఉన్నా ఆగని గర్జన
- ఎలుగెత్తి చాటిన ఆయన రచనలు
- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్
- తెలంగాణ ఉన్నంత వరకు దాశరథి పేరు : నిరంజన్‌రెడ్డి
- వనపర్తిలో దాశరథి జయంత్యుత్సవాలు

వనపర్తిలో జ్యోతి ప్రజ్వలన చేసి దాశరథి జయంతి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

వనపర్తి, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ అస్తిత్వాన్ని ప్రపంచానికి ఎలుగెత్తి చాటేలా రచనలు చేసిన గొప్ప వ్యక్తి దాశరథి కృష్ణమాచార్య అని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ కొనియాడారు. ప్రపంచ ధనవంతుల్లో ఒకరైన నైజాంలాంటి వ్యక్తిని ఎదురించిన అత్యంత ధైర్యశాలి అని పేర్కొన్నారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలో సాహితీ కళావేదిక, తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దేశపతి మాట్లాడుతూ.. జైల్లో ఉంటూ కూడా దాశరథి గర్జనలు ఆగలేదని అన్నారు. మలిదశ ఉద్యమంలో దాశరథి గోడలపై ప్రత్యక్షమయ్యారని, తెలంగాణలో బీఆర్ఎస్ పుట్టినప్పుడు 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ గోడల మీద రాసి తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేసిన ధీశాలి అని గుర్తుచేశారు. తెలుగు కవిత్వాన్ని సుసంపన్నం చేస్తూ.. తెలంగాణ అస్తిత్వాన్ని దాశరథి కవిత్వం పురివిప్పి నాట్యం చేసిందని తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లో తెలంగాణ వాణి వినిపించేందుకు నాడు కేసీఆర్ ప్రత్యేక రాజకీయ వేదిక టీఆర్ఎస్‌ను ఏర్పాటు చేస్తే.. అవహేళన చేశారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో తెలంగాణ బిల్లు పెట్టించే వరకు పోరాటం చేసే పరిస్థితి లేనప్పుడు పార్టీని ఆవిర్భవించేలా కేసీఆర్ చేశారన్నారు. కేసీఆర్ లేకుంటే తెలంగాణకు రాజకీయ స్వరం లేదని చెప్పారు. చారిత్రక అవసరాన్ని గుర్తించి ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి కేసీఆర్ టీఆర్ఎస్ స్థాపించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని దేశపతి పేర్కొన్నారు. తెలంగాణ ఉన్నంత వరకు దాశరథి పేరు చిరస్థాయిగా ఉంటుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. అతి తక్కువ కాలంలో ఎక్కువ రచనలు చేశారని గుర్తుచేశారు. ఆంధ్రా మహాసభలో, కమ్యూనిస్ట్ బాడీలో పనిచేశారని తెలిపారు. దాశరథికి నిజమైన నివాళులు కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అర్పించిందని అన్నారు.

తెలంగాణ వైభవాన్ని ప్రపంచానికి చాటారు : ఆర్ఎస్పీ

'దాశరథి గురించి మా తెలుగు టీచర్ ఒక్క రోజు కూడా చెప్పలేదు. తెలంగాణలో పుట్టి.. తెలంగాణగడ్డ వైభవాన్ని ప్రపంచానికి చాటిన దాశరథి గురించి తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది' అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. నాటి చదువుల ద్వారా తెలంగాణ కవుల గురించి తెలుసుకునే పరిస్థితులు లేవన్నారు. దాశరథి అద్భుతమైన రచనలు చేశారని, సినిమా పాటలు వింటుంటే ఇవి దాశరథి రాసిన వేనా? అన్నంత ఆశ్చర్యం కలిగిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కవులు కోటేశ్వరావు, శరత్‌చంద్ర, బాలరాం, సుబ్బయ్య, శంకర్‌గౌడ్, గట్టు యాదవ్, శ్రీధర్ పాల్గొన్నారు.

సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతున్న జూలూరి గౌరీశంకర్. చిత్రంలో టంకశాల అశోక్, నీహెచ్ ఉపేంద్ర

పదేండ్ల తర్వాత రైతులకు కన్నీళ్లు

- సూర్యాపేట జిల్లాలో ఎండుతున్న పంటలు
- రైతును రోజు కూలీగా మార్చడం నేరమే
- ఎండిన వరి చూస్తే మాకే దుఃఖమొస్తున్నది
- ఎండిన పంటలపై అధ్యయన కమిటీ సభ్యులు
- సూర్యాపేట జిల్లాలో పర్యటించిన టంకశాల అశోక్, జూలూరి గౌరీశంకర్, ఉపేంద్ర

సూర్యాపేట, మార్చి 29 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణలో నీళ్ల సమస్యతోనే కన్నీటి వరదలు పారాయి. ఆ నీళ్ల కోసమే స్వరాష్ట్ర ఉద్యమం ఉవ్వెత్తున సాగింది. పదేండ్లలో నీటి సమస్యలు తీరి కన్నీళ్లు దూరమయ్యాయి. ఇప్పుడు మళ్లీ అదే నీళ్ల సమస్య తెలంగాణలో కన్నీటి వరద పారిస్తున్నది' అని అధ్యయన కమిటీ బృందం ఆందోళన వ్యక్తంచేసింది. తెలంగాణ ప్రముఖులైన సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, సీనియర్ సంపాదకీయుడు టంకశాల అశోక్, హైకోర్టు న్యాయవాది ఉపేంద్రతో కూడిన అధ్యయన కమిటీ శనివారం సూర్యాపేట జిల్లాలోని పెన్‌పహాడ్, చివ్వెంల మండలాల్లో ఎండిన పంటపొలాలను పరిశీలించింది. అనంతరం సూర్యాపేట జిల్లా కేంద్రంలో మీడియాతో వారు మాట్లాడారు. రాష్ట్రం వచ్చాక చెరువులు మత్తళ్లు దుంకడం, పంటలు పండి సస్యశ్యామలం అవడం మన కండ్లతో చూశామని జూలూరి గౌరీశంకర్ గుర్తుచేశారు. ఇదే సూర్యాపేట జిల్లాలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనే అత్యధికంగా వరి పంట పండిందని, అలాంటి జిల్లా నేడు కన్నీళ్లు పెట్టడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వంపై రైతులు విమర్శలు చేయడం లేదని, తమను ఎందుకు ఏడిపిస్తున్నారంటూ ప్రశ్నిస్తున్నారని తెలిపారు. రెండు తడులకు నీళ్లిస్తే పంట బతుకుతుందని చెప్పినా ప్రభుత్వం స్పందించకపోవడంతో పంటచేలను పశువులతో మేపుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కలెక్టరేట్‌కు 10 కిలోమీటర్ల దూరంలోనే రైతులు కన్నీళ్లు పెడుతుంటే, ఆ అధికారులకు వారి కన్నీటి గోస వినిపించలేదా? అని ప్రశ్నించారు. రైతులను రోజు కూలీలుగా మార్చడం నేరమేనని చెప్పారు. వెంటనే అధికార యంత్రాంగం పంట నష్టపరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు.

ఎండిన పంట.. పశువులకు మేత: న్యాయవాది ఉపేంద్ర

ఎండిన పంటపొలాల్లో రైతులు పశువులను మేపుతున్నారని హైకోర్టు న్యాయవాది ఉపేంద్ర ఆవేదన వ్యక్తంచేశారు. రెండు తడులకు నీళ్లిస్తే చాలని రైతులు వేడుకుంటున్న తీరు గుండెను కలిచి వేస్తున్నదని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత తుంగతుర్తి, కోదాడ, సూర్యాపేట ప్రాంతాలకు ఎస్సారెస్పీ నీరు అందించడంతో లక్షల ఎకరాలు సస్యశ్యామలం అయ్యాయని చెప్పారు. నిరుడు సూర్యాపేట జిల్లా అత్యధికంగా వరి పంట పండించిందని తెలిపారు. కేసీఆర్ రైతుల కోసం అనేక పథకాలను తెచ్చారని గుర్తుచేశారు.

రాజకీయాల్లో నిజాయితీ అవసరం : టంకశాల అశోక్

రెండు తడులకు నీళ్లివ్వకుంటే నిజాయితీగా ఇవ్వలేమనే చెప్పాలని, అప్పుడు రైతులు ప్రత్యామ్నాయం ఎంచుకుంటారని సీనియర్ సంపాదకీయుడు టంకశాల అశోక్ తెలిపారు. కాళేశ్వరం చెడిపోవడం వల్ల నీళ్లివ్వలేక పోయామంటున్నారని, కాళేశ్వరం ప్రాజెక్టు రైతులు పంట వేయడానికి ముందు చెడిపోయిందికదా.. అలాంటప్పుడు రైతులకు ఎలా నీళ్లిస్తామని మాట ఇచ్చారని ప్రశ్నించారు. మొదట కొన్ని తడులకు నీళ్లిచ్చి చివరి తడులకు నీళ్లివ్వలేదని, బోర్లు వేస్తే నీళ్లు పడటం లేదని చెప్పారు. చివరి తడులకు నీళ్లు ఇవ్వకపోవడంతో రైతులు అప్పులపాలయ్యారని, ఇప్పుడు ప్రభుత్వం ఒకవేళ రెండు తడులు ఇచ్చినా అవి అప్పులకే సరిపోతాయని చెప్పారు. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.30వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి. విద్యార్థి నిఖిల్ (ఫైల్)

గురుకుల విద్యార్థి మృతి

సంగారెడ్డి జిల్లాలో ఘటన

సంగారెడ్డి/ హైదరాబాద్, (నమస్తే తెలంగాణ): కల్హేర్/సిర్గాపూర్, మార్చి 29: మెదక్ జిల్లా పెద్దశంకరంపేట్ మండలం చీలపల్లికి చెందిన దార నిఖిల్‌కుమార్ (14) సిర్గాపూర్ మండలం నల్లవాగు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. వారంరోజులుగా అనారోగ్యానికి గురై భోజనం చేయక ఆరోగ్యం దెబ్బతినడంతో 26న పాఠశాల ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వెంటనే విద్యార్థి కుటుంబీకులు హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. తమ కుమారుడి మృతికి పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ తల్లిదండ్రులు, బంధువులు విద్యార్థి మృతదేహంతో గురుకుల పాఠశాల ముట్టడికి యత్నించారు. నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి ఘటనా స్థలానికి చేరుకుని ఆర్‌సీవో నిర్మలతో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే విద్యార్థి అంత్యక్రియల కోసం రూ.50 వేలు అందజేసి, ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ధర్నా వద్దకు చేరుకుని మద్దతు తెలిపారు.

సర్కారు నిర్లక్ష్యానికి నిఖిల్ బలి

సర్కారు నిర్లక్ష్యానికి విద్యార్థి నిఖిల్ బలైపోయారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. 'విద్యార్థి మరణం బాధాకరం.. చిన్న జ్వరానికే ప్రాణాలు కోల్పోయే పరిస్థితి రావడం శోచనీయం' అంటూ శనివారం ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు. 83 మంది గురుకుల విద్యార్థులు మరణించినా దిద్దుబాటు చర్యలు చేపట్టని ప్రభుత్వ అసమర్థతకు ఈ ఘటనే ఉదాహరణ అన్నారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులను రక్షించాలని, నిఖిల్ కుటుంబానికి రూ. 15 లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో రాబందుల పాలన

మొదటిపేజీ తరువాయి...

పోరాడుతుంటే ఓర్వలేక దమనకాండకు దిగుతున్నారని విమర్శించారు. సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న కార్యకర్తలను టార్గెట్ చేస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 15, 16 తేదీల్లోనే 15 అక్రమ కేసులు బనాయించారని తెలిపారు. సైబర్ నేరస్తుల నుంచి ప్రజలను రక్షించేందుకు కేసీఆర్ ఏర్పాటుచేసిన సైబర్ సెక్యూరిటీని సీఎం తన రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఐటీ యాక్ట్‌కు విరుద్ధంగా ఎఫ్ఐఆర్‌లు నమోదవుతున్నాయని, రీ ట్వీట్ చేసినా, వాట్సాప్‌లో స్టేటస్ పెట్టుకున్నా వదలడంలేదని తెలిపారు. గొర్రెల స్కాంలో కొడంగల్‌కు చెందిన ఓ అధికారిని అకారణంగా జైల్లో పెట్టిన పోలీసులు.. హరీశ్‌రావుపై పెట్రోల్ పోసి చంపుతానన్న కాంగ్రెస్ నేతపై ఎందుకు కేసు పెట్టలేదని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో శనివారం బీఆర్ఎస్ నేతలు గెల్లు శ్రీనివాస్, బమ్మెర రామ్మూర్తి, అభిలాష్ రంగినేని, సైదులుతో కలిసి ప్రవీణ్ విలేకరులతో మాట్లాడ